సాక్షి
అనకాపల్లి
గురువారం । 14 । మార్చి । 2024



జింకల సందడి

విశాఖ: ఆరిలోవ ప్రాంతంలో జాతీయ రహదారి పక్కన జింకలు పచ్చిక, చెట్ల చిగుళ్లు మేస్తూ సందడి చేశాయి.



గీతాంజలికి నివాళి

రావికమతం: సోషల్ మీడియా ఆగడాలతో మృతి చెందిన గీతాంజలికి విప్ ధర్మశ్రీ, డ్వాక్రా మహిళలు నివాళులర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
అనకాపల్లి	6.10	4.52
నర్సీపట్నం	6.13	4.50

గిరిసీమలో ప్రగతి సిరులు

- ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యం
- సబ్ ప్లాన్ నిధుల సద్వినియోగంతోనే అది సాధ్యం
- గత ఐదేళ్లలో రూ.20 వేల కోట్లు వెచ్చించిన రాష్ట్ర ప్రభుత్వం
- సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్ నాయక్



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సాక్షి, అనకాపల్లి, చోడవరం రూరల్: అధికారులు తమ పరిధిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కచ్చితంగా సద్వినియోగం చేయాలని, అవసరమైతే అంతకుమించి నిధులు వెచ్చించినా మంచిదేనని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ సూచించారు. గిరిజనులకు అండగా నిలవడంలో గత ప్రభుత్వాలకు నేటి జగనన్న ప్రభుత్వానికి ఎంతో తేడా ఉందని, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడమే సర్కారు ధ్యేయమన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా చోడవరం వచ్చిన ఆయన స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ట్రైబల్ రైట్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు, మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకుల అభిప్రాయాల మేరకు ఆయన స్పందించారు. ఆయా మండలాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఎంతెంత మేరకు విడుదలయ్యాయి, వాటిని ఎంతమేరకు వెచ్చించారు అడిగి తెలుసుకున్నారు. 2019 నాటి లెక్కలతో ఆగిపోకుండా 2024 నాటి పరిస్థితికి అనుగుణంగా ఆయా వర్గాల అభివృద్ధికి అధికారులు పెద్ద మనసుతో పాటుపడాలన్నారు. విద్యార్థి సంఘ నాయకునిగా ఉన్నప్పటినుంచి తనకు ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. తహసీల్దార్లు ఎస్టీ సబ్ ప్లాన్ ఏరియాలో గిరిజనులకు శ్మశానవాటికలు లేని గ్రామాలను గుర్తించి, అలాంటి చోట కనీసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల మేరకు కేటాయింపు చేయాలని సూచించారు. ఆయా వర్గాలకు కేటాయించిన 6 శాతం నిధులను తప్పకుండా వారి సంక్షేమానికే ఖర్చు చేయాలన్నది తమ కమిషన్ అభిమతమని స్పష్టం చేశారు. అంతకు ముందు ట్రైబల్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపకుడు ఆర్.ఎస్.వరహాలు దొర తన అధ్యక్షోపన్యాసంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకొచ్చారు. ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, విశ్రాంత లెక్చరర్ నడుపూరి దేముడు, అంబేడ్కర్ సంఘం ప్రతినిధి వరప్రసాద్ తదితరులు పలు సమస్యలను, అనుకూల పరిష్కారాలను సూచించారు. ఆయనతోపాటు పర్యటనలో ఏజెన్సీ ఎంపీటీసీ సభ్యుడు పూర్ణరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తల సంఘం ప్రతినిధి మామిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలను విస్మరించిన టీడీపీ సర్కారు

గత టీడీపీ ప్రభుత్వం ఎస్టీలను విస్మరించిందని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ అన్నారు. అనకాపల్లి రింగ్‌రోడ్డులో గల ప్రైవేటు హోటల్లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఎస్టీలకు రూ.5 కోట్లు ఖర్చు చేస్తే..అంతకు నాలుగు రెట్లు ఎక్కువగా రూ.20 వేల కోట్లు ఎస్టీ సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందని చెప్పారు. గిరిజనులు అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఒక డిప్యూటీ సీఎం, ఒక మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా టీటీడీ దేవస్థానం పాలకమండలిలోనూ, శ్రీశైలం పాలకమండలిలో ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ఆదివాసీ బతుకుల్లో వెలుగులు

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడి ఉన్న ఆదివాసీ బతుకుల్లో వెలుగులు నింపిన దేవుడని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మాడుగుల వచ్చిన ఆయన స్థానిక ఎస్టీ బాలికల, బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడ వంటకాలు, కూరగాయలు, బియ్యం ఎలా ఉన్నాయో పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా ఆరా తీశారు. భోజనాలు రుచిగా వండి పెడుతున్నారని, సదుపాయాలు కూడా బాగున్నాయని విద్యార్థులు బదులిచ్చారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 వేల కోట్లు గిరిజనాభివృద్ధికి ఖర్చుపెట్టారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనతోపాటు విదేశీ విద్యా దీవెన వంటి పథకాలతో నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడంతోపాటు ప్రత్యేకంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. మాడుగుల పట్టణంలో రెండు ఎస్టీ వసతి గృహాలు ఏర్పాటు చేసి, మారుమూల గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు, తాగునీరు అందించి గిరిజనాభివృద్ధికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకొని గిరి విద్యార్థులు ఉన్నత చదువులు చదువు కొని, ఉన్నతమైన ఉద్యోగాలలో స్థిరపడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని నెరవేర్చాలని ఆకాక్షించారు. మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ రాయితీలు అందడం లేదని ట్రైబల్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపకుడు ఆర్.ఎస్.వరహాలు దొర శంకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.నాగశిరీష, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కాశీప్రసాద్, వార్డెన్ శైలజ, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, వైఎస్సార్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శోలం రమేష్, ఆదివాసీ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యుడు మధు, తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల ఎస్టీ బాలుర వసతి గృహంలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సింబయో జనరిక్ ఫార్మాలో ప్రమాదం

- ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు
- బాయిలర్ క్లీన్ చేస్తుండగా మీద పడిన రసాయన ద్రావణం
- చికిత్స కోసం విశాఖ తరలింపు
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటున్న కార్మికులు



తీవ్రంగా గాయపడిన రాము

రాంబిల్లి: లాలంకోడూరు సమీపంలో గల సింబయో జనరిక్ ఇండియా ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. బాయిలర్ శుభ్రపరుస్తుండగా వేడి నీటితో కూడిన రసాయన ద్రావణం మీద పడిపోవడంతో వారు తీవ్రంగా కాలిపోయినట్లు కార్మికులు పేర్కొన్నారు. చోడవరం మండలం అంభేరుపురం గ్రామానికి చెందిన అట్టా రాము, రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి గ్రామానికి చెందిన కె.నర్సింగరావు, మర్రిపాలెం గ్రామానికి చెందిన కె.సన్యాసిరావు శరీరాలు తీవ్రంగా కాలిపోయాయి. వీరిని విశాఖపట్నంలో అపోలో ఆస్పత్రికి తరలించారు. ముఖాలపై కాస్త తక్కువ గాయాలైనప్పటికీ మొత్తం శరీర భాగాలు బాగా కాలిపోయాయని, వీరి పరిస్థితి విషమంగా వుందని రాము, నర్సింగరావు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ కంపెనీలో గురువారం ఉన్నతాధికారులు పరిశీలన ఉండటంతో బుధవారం బాయిలర్ క్లీనింగ్ చేపట్టారని, నిబంధనలకు విరుద్ధంగా వేడి ఎక్కువగా ఉండటంతో వాల్వు తెరవగానే ఒక్కసారిగా విపరీతమైన వేడి ఆవిరితో కూడిన ద్రావణం తమ శరీరాలపై పడిపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి వైద్యానికి యాజమాన్యం పూర్తిగా సహకరించి తమకు న్యాయం చేయాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. కంపెనీ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు.

గోప్యంగా ప్రమాద ఘటన

సింబయో కంపెనీలో జరిగిన ప్రమాదాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచింది. పోలీసులు, కంపెనీ యాజమాన్యం సంఘటన స్థలానికి మీడియాను అనుమతించలేదు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణతో కలిసి తాము పరిశీలించామని సీఐ లక్ష్మణరావు పేర్కొన్నారు. కంపెనీలో ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యాలు నిర్లక్ష్యంగానే ఉంటున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు విమర్శించారు.

సీడీసీ చైర్మన్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం

చోడవరం: చెరకు అభివృద్ధి మండలి (సీడీసీ) చైర్మన్‌గా సుంకర శ్రీనివాసరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఈ చెరకు అభివృద్ధి మండలి ద్వారా రైతులకు ఎరువులు, క్రిమిసంహారకమందులు, ఇతర పనిముట్లు, సలహాలు అందిస్తారు. సీడీసీకి ఇప్పటి వరకు ఉన్న పాలక మండలి పదవీ కాలం ఇటీవల ముగియడంతో సుంకర శ్రీనివాసరావును చైర్మన్‌గా నియమించారు. ఫ్యాక్టరీ పరిధిలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన వారే ఎక్కువగా సీడీసీ చైర్మన్లుగా వ్యవహరించారు. ఈసారి కూడా మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావును నియమించారు. డిప్యూటీ సుగర్ కేన్ కమిషనర్ లోకేష్, గోవాడ సుగర్స్ ఎండీ సన్యాసినాయుడు సమక్షంలో శ్రీనువాసరావు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లివిల్లి సంజీవరావు, చీడికాడ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, సర్పంచ్‌లు సుంకర కొండబాబు, పడాల శ్రీను, పాతాల చిన్నంనాయుడు, పడవాడ రామారావు తదితరులు అభినందించారు. రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి, సకాలంలో ఫ్యాక్టరీ ద్వారా అన్ని సమకూర్చేందుకు కృషి చేస్తానని శ్రీనివాసరావు చెప్పారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ముగిసిన గోవాడ సుగర్స్ క్రషింగ్

- ఈ సీజన్‌లో 1.70 లక్షల టన్నుల గానుగాట
- నాణ్యత పెరిగినా లక్ష్యాన్ని చేరుకోలేకపోయిన వైనం

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో బుధవారం క్రషింగ్ ముగిసింది. లక్షా 70 వేల 601 టన్నుల చెరకు గానుగాడి ఈ ఏడాది క్రషింగ్‌ను ముగించారు. మెరుగైన రికవరీ, నాణ్యమైన పంచదార తయారీలో గత సీజన్ల కంటే మంచి ఫలితాలు వచ్చినప్పటికీ ఈ సీజన్‌లో అనుకున్న క్రషింగ్ లక్ష్యానికి కాస్త దూరంలో ఉండిపోవలసి వచ్చింది. ఫ్యాక్టరీ పరిధిలో చెరకు విస్తీర్ణం తగ్గి ఆశించినంత మేర సరకు సరఫరా కాకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. గతేడాది 3.5 లక్షల టన్నులు లక్ష్యంగా పెట్టుకోగా 2.22 లక్షల టన్నులు మాత్రమే క్రషింగ్ జరిగింది. ఈ ఏడాది కూడా 2 లక్షల టన్నుల చెరకు గానుగాడవచ్చని లక్ష్యంగా పెట్టుకొని క్రషింగ్ బరిలోకి దిగారు. కానీ లక్షా 70 వేల 601 టన్నుల క్రషింగ్ చేసి నిలిచిపోయింది. డిసెంబరు 15వ తేదీన ప్రారంభమైన క్రషింగ్ జోరుగానే సాగింది. సీజన్ ముగింపు దశకు వచ్చేసరికి ఫ్యాక్టరీ ఏరియాలో చెరకు లేకపోగా ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీల నుంచి వస్తుందనుకున్న చెరకు రాలేదు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయారు. లక్షా 70 వేల 601 టన్నుల క్రషింగ్ చేసి లక్షా 44 వేల క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేశారు. ఈ సీజన్‌లో ఉత్పత్తి మాత్రం చాలా మెరుగ్గా వచ్చింది. సరాసరి రికవరీ 9.3కి దాటి వచ్చింది. సీజన్ మొత్తంలో కొన్ని రోజులు డే రికవరీ 10.67 కూడా రావడంతో పంచదార దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. రికవరీతోపాటు పంచదార క్వాలిటీ కూడా ఈసారి బాగుంది. ఈ ఏడాది యాజమాన్యం తీసుకున్న జాగ్రత్తలకు సూపర్ ఫైన్ రకంగా పూర్తిగా తెల్ల క్రిస్టల్‌లో పంచదార ఉత్పత్తి అయ్యింది. ఓవరాయిలింగ్ పనులు లేకుండానే సీజన్ పూర్తిగా క్రషింగ్ చేయడం వల్ల ఫ్యాక్టరీకి ఓవరాయింగ్ పనులకు అయ్యే ఖర్చు మిగిలింది. ఏది ఏమైనా రాష్ట్రంలో ఈ ఏడాది అన్ని సహకార చక్కెర కర్మాగారాలు చెరకు లేక, ఆర్థిక ఇబ్బందులతో క్రషింగ్ చేయలేక చతికిలపడగా గోవాడ ఫ్యాక్టరీ మాత్రం తన సొంత కెపాసిటీతో గానుగాడి ఫ్యాక్టరీపై ఆధారపడి జీవిస్తున్న చెరకు రైతులకు, కార్మికులకు అండగా నిలబడింది. ఈ ఏడాది కో జనరేషన్ ద్వారా 18 లక్షల 52 వేల 300 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. క్రషింగ్ సజావుగా సాగడానికి కృషి చేసిన రైతులకు, కార్మికులకు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ సన్యాసినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కమిటీ కార్యదర్శిగా అచ్చిమనాయుడు

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కమిటీ కార్యదర్శిగా కొల్లిమల అచ్చిమనాయుడును నియమించారు. ఈమేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇన్‌స్పైర్ ఇండియా పోటీలకు లక్ష్మీపురం విద్యార్థిని



చిత్తూరు డీఈవో నుంచి జ్ఞాపిక అందుకుంటున్న గుణశ్రీ కీర్తి

చోడవరం రూరల్: లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.గుణశ్రీ కీర్తి జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఇండియా పోటీలకు ఎంపికయ్యింది. చిత్తూరు జిల్లా పలమనేరులో ఈ నెల 11 నుంచి మూడు రోజులపాటు జరిగిన ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గుణశ్రీ కీర్తి ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ ఆఫ్ ఆనియన్ క్రైసిస్ ఇన్ ఇండియా (భారత్‌లో ఉల్లి హెచ్చు తగ్గులలో ఎదుర్కొంటున్న సమస్యలకు అధునాతన పరిష్కారాలు) అన్న అంశంపై తయారు చేసిన ప్రాజెక్టు పలువురు న్యాయ నిర్ణేతలను ఆకట్టుకుంది. దీంతో కొద్ది రోజుల్లో జాతీయ స్థాయిలో జరగనున్న ఇన్‌స్పైర్ పోటీలకు ఈ ప్రాజెక్టును ఎంపిక చేశారు. ఉల్లి పంటను తక్కువ ఖర్చుతో నిల్వ చేసుకునే విధానాన్ని గుణశ్రీ కీర్తి ఈ ప్రాజెక్టులో వివరించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన గుణశ్రీ కీర్తికి చిత్తూరు డీఈవో, తదితర అతిథులు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందచేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో అనకాపల్లి జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఈ ప్రాజెక్టు ఒక్కటే ఎంపిక కావడంతో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఎస్‌వో కాళిదాసు అభినందనలు తెలిపారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వి.జగన్నాథరావు బుధవారం వెల్లడించారు. జాతీయ పోటీకి ఎంపికైన విద్యార్థిని కీర్తిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.రామారావు, సర్పంచ్ శిరిసోళ్ళ గంగాభవాని ఆది గణపతి నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

తుమ్మపాల: బడుగు బలహీన వర్గాలవారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా.. అవసరమైన పరికరాలు, లోన్ల మంజూరుకు ప్రధాని నరేంద్ర మోదీ పీఎం సూరజ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చారని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. ప్రధాని ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో బుధవారం ఆయనతోపాటు అధికారులు, 125 మంది లబ్ధిదారులు వీక్షించారు. పోర్టల్ ద్వారా వివిధ పథకాలలో రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని బీసీ కార్పొరేషన్ ఈవో నిర్మల తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.అమ్మాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రుణాలు మంజూరు ప్రక్రియను మరింత సులభతరం చేసిందని, వేగంగా రుణాలు మంజూరవుతాయని తెలిపారు. జాతీయ ఎస్సీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నర్సీపట్నానికి చెందిన కొట్టు ఎల్లాజీరావుకు రూ.31 లక్షల విలువైన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం మంజూరైందని, ఇదివరకే లబ్ధిదారుడికి వాహన తాళాలను కలెక్టర్ అందించినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ద్వారా లోన్లు పొందవచ్చన్నారు. ఈ పోర్టల్ ద్వారా నమస్తే, ఆయుష్మాన్‌భవ కార్డులు పొందవచ్చన్నారు. డీఆర్డీఏ పీడీ శచీదేవి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి, మెప్మా పీడీ సరోజిని, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపల్ కమిషనర్లు, లబ్ధిదార్లు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి వాహన తాళాలను అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి (ఫైల్)

స్ఫూర్తిదాత కవయిత్రి మొల్లమాంబ

తుమ్మపాల: జ్ఞాన సముపార్జన కొందరికే సొంతం కాదని, కృషి పట్టుదల ఏకాగ్రతతో ఎవరైనా జ్ఞానాన్ని పొందవచ్చని కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. ప్రాచీన తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు కాలంలో జీవించిన ఆమె తన దైవభక్తి పద్య కవిత్వంతో ఎంతో పేరు తెచ్చుకున్నారన్నారు. కుమ్మరి, శాలివాహన సామాజిక వర్గానికి చెందిన ఆమె అపార జ్ఞానంతో మొల్ల రామాయణం రచించారన్నారు. ప్రభుత్వం కుమ్మరి శాలివాహనులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ అర్జున వెంకటరావు, డీఆర్వో దయానిధి, కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎ.జగదీశ్వరరావు, ఎం.సత్యనారాయణ, కె.శేషగిరిరావు, బి.నరసింహం పాల్గొన్నారు.



కవయిత్రి మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మొల్లమాంబకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఎస్పీ నివాళి

అనకాపల్లి: తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి ఎస్పీ కార్యాలయంలో బుధవారం జరిగింది. మొల్లమాంబ చిత్రపటానికి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్బీ డీఎస్పీ అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కె.కుమారస్వామి, ఎస్సైలు రఘువర్మ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ, జనసేన ట్రోలింగ్ వల్లే గీతాంజలి మృతి

- జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ

కె.కోటపాడు: టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారు చేసిన ట్రోలింగ్ కారణంగానే గీతాంజలి మృతి చెందిందని అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. కె.కోటపాడులో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో గీతాంజలికి సొంతింటి కల నెరవేరిందనే ఆనందంతో ప్రభుత్వంపై ఆమె చేసిన హర్షంపై టీడీపీ, జనసేనకు చెందిన వారు అసభ్యంగా ట్రోలింగ్ చేయడం వల్ల మనస్థాపం చెందిందని అన్నారు. దీనికి కారణమైన వారికి కఠిన శిక్ష అమలు చేయాలని ఆమె కోరారు.

తప్పుడు అట్రాసిటీ కేసులపై చర్యలు తీసుకోవాలి

నర్సీపట్నం: తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, మరువాడ ఈశ్వరరావు, మార్తి, అప్పలరాజు, చిట్ల చలపతిరావు డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆరు అట్రాసిటీ ఫిర్యాదులు ఉన్నాయన్నారు. తప్పుడు ఫిర్యాదులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యంతో మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

చోడవరం రూరల్ : అక్రమంగా మద్యం విక్రయించేందుకు మండలంలోని అడ్డూరు గ్రామానికి పెద్ద సంఖ్యలో మద్యం సీసాలు తరలిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాత్రి అంభేరుపురం జంక్షన్‌లో ఉన్న అడ్డూరు గ్రామానికి చెందిన చిట్టిబోయిన కనకరాజు భార్య వరలక్ష్మిని ఎస్ఐ సూర్యనారాయణ, సిబ్బంది తనిఖీ చేయగా ఆమె 24 మద్యం సీసాలు కలిగి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

రంపచోడవరం నియోజకవర్గం.. 11 మండలాలు.. ఎటు చూసినా దట్టమైన అభయారణ్యం.. కనీస మౌలిక వసతులు లేక గిరిజనులు ఎన్నో ఇబ్బందులు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సుమారు రూ.1500 కోట్లకు పైగా సంక్షేమానికి ప్రభుత్వం వెచ్చించడంతో గిరిజనుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. మరో రూ. 1500 కోట్లకు పైగా నిధులు అభివృద్ధికి కేటాయించడంతో పూర్తిస్థాయిలో వసతులు అందుబాటులోకి వచ్చాయి. రంపచోడవరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టి ఆధ్యాత్మికంగాను అభివృద్ధి చేసింది. జలవిద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడంతో పొల్లూరు జల విద్యుత్ కేంద్రం రాష్ట్రానికి తలమానికంగా నిలవనుంది. ఇక్కడ 5,6 యూనిట్ల నిర్మాణం రూ.530 కోట్లతో చేపట్టడంతో ఈ ప్రాజెక్ట్ మరింత వెలుగులు పంచనుంది.



5,6 యూనిట్లు ఏర్పాటుకానున్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రం (ఇన్‌సెట్) చురుగ్గా జరుగుతున్న కొత్త యూనిట్ల పనులు

- రూ.3వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- 40 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు
- రూ. 49.26 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో రాణింపు
- పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రూ.530 కోట్లతో 5,6 యూనిట్ల నిర్మాణం

కొండకోనల్లో ప్రగతి వెలుగులు

రంపచోడవరం గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

రంపచోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రంపచోడవరం నియోజకవర్గం ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలతోపాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించింది. మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం, సమాచార వ్యవస్థ, విద్య, వైద్య వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చింది.

18,331 మందికి 46,820 ఎకరాలు

18,331 మందికి 46,820 ఎకరాల పోడు భూములకు పట్టాలు మంజూరు చేసింది.

140 సచివాలయ భవనాల పూర్తి

డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 140 గ్రామ సచివాలయాల భవన నిర్మాణం పూర్తయింది.

ఇంటింటికీ కుళాయిలు

జలజీవన్‌మిషన్ పథకంలోమొదటి విడతలో వంద గ్రామాల్లో తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 67.79 కోట్లు వెచ్చించింది. వీటిలో 199 చోట్ల పనులు పూర్తయ్యాయి. తాగునీటి అవస్థలు తప్పాయి.

15 రోడ్ల నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

15 రోడ్లకు అటవీ అభ్యంతరాలు తొలిగాయి. మారేడుమిల్లి మండలంలోని మర్రివాడ- బుగ్గిలోవ, భీమవరం-అర్జునలోవ, వేటుకూరు-దేవుడు లంక, దొరవారివీధి-మట్లగొమ్మి, అడ్డతీగల మండలంలో దుశ్శర్తి-డి.పోలవర్ప డు, బడదాం-ఉయ్యాలమడుగు, ఉయ్యాలమడుగు-గొర్రిగొమ్మి, బడదాం, మట్లపాడు, జడేరు జంక్షన్- పనుకురాతిపాలెం, రాజవొమ్మంగి మండలంలో దోనెలపాలెం-గొబ్బిలమడుగు, రాజవొమ్మంగి-బూరుగుపల్లి రోడ్లకు అటవీ చిక్కులు తొలగాయి.

ఆధ్యాత్మికంగా..

నియోజకవర్గాన్ని ఆధ్యాత్మికంగాను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఐ.పోలవరం సమీపంలోని పులిమెట్టపై సుమారు రూ.7.50 కోట్లతో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం నిర్మించింది. టీటీడీ శ్రీవాణి ప్రాజెక్ట్‌లో భాగంగా నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో 82 ఆలయాలను నిర్మిస్తోంది. ఒకొక్క దానికి రూ.10 లక్షలు వెచ్చిస్తోంది. ఇవన్నీ రెండు నెలల్లో పూర్తి కానున్నాయి.

సాగునీటి పరంగా..

గోదావరి డెల్టాకు విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8 నుంచి 10 టీఎంసీల నీటిని ఏటా రబీలో ప్రభుత్వం అందిస్తోంది. దీనివల్ల సుమారు 8.96 లక్షల ఎకరాలకు బెట్ట పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో ఉపయోగపడుతుంది.

అన్నదాతకు అండగా..

రంపచోడవరంలో ఏర్పాటుచేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. దీనిని రూ.67 లక్షలతో నిర్మించింది.

- నాడు-నేడు పథకంలో భాగంగా రంపచోడవరం డివిజన్‌లో ఫేజ్ వన్ 133 పాఠశాలల్లో రూ. 32.42 కోట్లతో పనులు చేపట్టి పూర్తి చేశారు. అలాగే ఫేజ్ 2లో 174 పాఠశాలల్లో రూ. 43.47కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు.
- రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 2019 నుంచి 2024 వరకు 192.89 కిలో మీటర్లు మేర 12 రోడ్లను రూ. 172.16 కోట్ల వ్యయంతో చేపట్టింది. మారేడుమిల్లి-గుర్తేడు రోడ్డు నిర్మాణంతో సుమారు వంద గిరిజన గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడింది.
- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వంద పడకల వసతితో పాటు రూ. 12.60 కోట్లతో మాతాశిశు సంరక్షణ భవనం నిర్మించారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

పెరగనున్న 'పొల్లూరు' ఉత్పత్తి సామర్థ్యం

సీలేరు విద్యుత్ కాంప్లెక్సు పరిధిలోని జల విద్యుత్ కేంద్రాల నిర్వహణ, విస్తరణ పనులపై గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కొత్త యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 460 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. అదనంగా విద్యుత్ ఉత్పత్తి కోసం రూ. 530 కోట్ల వ్యయంతో ఐదు, ఆరు యూనిట్లు నిర్మాణం చేపట్టారు. ఇవి పూర్తయితే అత్యధిక ఉత్పత్తి సామర్థ్యం గల ప్రాజెక్టుగా రాష్ట్రంలో పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు లభించనుంది.



స్థాయి పెరగనున్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రం

నిరంతరం విద్యుత్ సరఫరా

రాష్ట్రం విడిపోయిన తరువాత తెలంగాణకు చెందిన 4 మండలాలు జిల్లాలో కలిశాయి. అయితే వాటికి తెలంగాణలోని సీతారామపట్నం నుంచి ఎటపాకలోని సబ్‌స్టేషన్‌కు సరఫరా జరిగేది. తరచూ అంతరాయం ఏర్పడేది. దీంతో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రూ. 39కోట్లతో చింతూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి నాలుగు మండలాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తోంది.

ఎన్నడూ లేనంతగా అభివృద్ధి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా గిరిజనులు కోరుకుంటున్నారు. అభివృద్ధి, సంక్షేమానికి రూ. 3వేల కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. గిరిజనులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు రంపచోడవరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఏజెన్సీలో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుతో వైద్య సేవలను మరింత బలోపేతం చేశారు. కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేసి, రైతు భరోసా అమలు చేసిన ఘనత జగనన్నకు దక్కుతుంది. గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం విశేష కృషి చేసింది. మారేడుమిల్లి-గుర్తేడు రోడ్డు, చవిటిదిబ్బలు రోడ్డు, గంగవరం- కొత్తపల్లి రోడ్డు, కొండకాలువలపై వంతెనల నిర్మాణం చేపట్టాం. వర్షాకాలంలో కాలువలు పొంగితే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. బ్రిడ్జిల నిర్మాణంతో ఆ సమస్య తప్పింది. స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 9 మెగా జాబ్‌మేళాలు, 13 మినీ జాబ్ మేళాలు నిర్వహించాం. 1600 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. స్కిల్ హబ్ ద్వారా 150 మందికి శిక్షణ, అనంతరం ఉద్యోగాలు కల్పించాం. మలేరియాను పూర్తిగా నివారించాం. గ్రామ సచివాలయ వ్యవస్థతో మారుమూల గ్రామాల్లో సైతం స్థానికంగా సేవలు అందుబాటులోకి రావడంతో గిరిజనులకు వ్యయప్రయాసలు తప్పాయి.

– నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్యే, రంపచోడవరం

గ్రామాల అభివృద్ధితో ప్రజల్లో ఎనలేని ఆనందం

కె.కోటపాడు: గ్రామాల్లో జరిగిన అభివృద్ధితో ప్రజల్లో ఎనలేని ఆనందం వ్యక్తం అవుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వారాడ, యడ్లవానిపాలెం గ్రామాల్లో బుధవారం రూ.కోటి 24 లక్షలతో నిర్మాణం పనులు పూర్తి చేసుకున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.కోటి 12 లక్షలతో ఆర్.వై.అగ్రహారం రోడ్డు నుండి యడ్లవానిపాలెం వరకూ 650 మీటర్ల సీసీ రోడ్డు, యడ్లవానిపాలెంలో రూ. 12 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనం, ప్రహరీ ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును గ్రామస్తులు సన్మానించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్.వై.అగ్రహారం రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన కేంద్ర బృందం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని బుధవారం కేంద్ర వైద్యబృందం సందర్శించింది. బృంద సభ్యుడు (విజయవాడ) డాక్టర్ సన్‌దేష్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆరు విభాగాలను పరిశీలించి రోగి స్థితిగతులను ఆన్‌లైన్‌లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించినట్టు చెప్పారు. రోగి సమస్యలను ఆస్పత్రిలో ఎప్పటికప్పుడు ఏ విధంగా నమోదు చేస్తున్నారో గమనించామన్నారు. ఆయన వెంట వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో లక్ష్మణ శ్రీనివాస్, వైద్యసిబ్బంది ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు

చీడికాడ: మండలంలోని తునివలసకు చెందిన 9 టీడీపీ కుటుంబ పెద్దలు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువాలు కప్పి ముత్యాలనాయుడు వారిని ఆహ్వానించారు. బూడి మాట్లాడుతూ పార్టీ నాయకత్వంపై నిబద్ధతతో ఉండే ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటూ శక్తి వంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నుంచి పార్టీలో చేరిన నేతలు గుటాల శ్రీను, గుటాల రాంబాబు, గుటాల చినబాబు, శెట్టి ఈశ్వరరావు, గుటాల చిన అప్పలనాయుడు, గుటాల సంతోష్, దొడ్డి దేముడు, కొమ్మనాపల్లి ఆదినారాయణ, పాతాళం రామునాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో డిప్యూటీ సీఎం బూడి చేపట్టిన అభివృద్ధితో గ్రామాలు వెలుగుతున్నాయన్నారు. సర్పంచ్ పడాల హేమా శ్రీను, మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నేతలతో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

ఎన్నికల నియమావళిపై అవగాహన

తుమ్మపాల : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ఎన్నికల నియమ నింబంధనలపై క్షుణ్ణమైన అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రక్రియ ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. అప్పటి నుండి నియమావళి ప్రకారం నడుచుకోవలసి ఉంటుందన్నారు. అభ్యర్థులు, పార్టీలకు అవగాహన సమావేశాలు ఉంటాయన్నారు. శాసన సభకు పోటీచేసే వారు రూ.10 వేలు, లోక్ సభకు పోటీచేసే వారు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం చెల్లిస్తే చాలని తెలిపారు. అఫడవిట్ తయారీ విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, బలపరిచే అభ్యర్థులు, వారికి సంబంధించిన పత్రాల గురించి తెలియజేస్తామన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలని, ఎన్నికల ఖర్చు లెక్కిస్తామని స్పష్టం చేశారు. ఓట్ల జాబితా సవరణలో భాగంగా, ఈ వారంలో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులు, తొలగింపులరే సంబంధించిన వివరాలు వెల్లడించారు. మార్కెట్లో ఉన్న ధరల ఆధారంగానే ఉపయోగించిన వాటి ధరలను నిర్ణయిస్తామన్నారు. ఎన్నికల సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, ఎస్పీ తులసీరామ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు, డి.సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ఓటు నమోదు శాతం పెంపొందాలి

- స్వీప్ నోడల్ ఆఫీసర్ శచీదేవి

నర్సీపట్నం: ప్రతి ఒక్కరికీ ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, ఓటు నమోదు శాతం పెంచాలని డీఆర్‌డీవో పీడీ, జిల్లా స్వీప్ నోడల్ ఆఫీసర్ శచీదేవి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశంతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు నమోదు శాతం తక్కువ ఉన్న ఏరియాల్లో ఓటు నమోదు శాతం పెంపునకు కృషి చేయాలన్నారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు ఎన్నికల విధులను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పడంతో పాటు ఓటరు జాబితా పరిపూర్ణంగా ఉండేటట్లు చూడాలన్నారు. కొత్తగా ఓటు పొందిన వారు నిజాయితీగా, కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు అవశ్యకతపై గిరిజన వికాస్ ఎన్జీవో డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శచీదేవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, ఎంపీడీవో లింకన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, ఏపీఎం, ఏసీలు, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా స్వీప్ నోడల్ ఆఫీసర్ శచీదేవి

ఇంటింటి కుళాయి పథకం ప్రారంభం

రావికమతం : ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కొత్తకోట గ్రామంలో రూ.7.66 కోట్లతో, ఎడ్లబందలో రూ.20 లక్షలతో, తట్టబందలో రూ.39 లక్షలతో, కొమిరలో రూ.45 లక్షలతో, జెడ్.కొత్తపట్నంలో రూ.68 లక్షలతో, గంపవానిపాలెంలో రూ.29 లక్షలతో, పి.పొన్నవోలులో రూ.47లతో నిర్మించిన ఇంటింటి కుళాయిలను బుధవారం ఆయన ప్రారంభించారు. సీఎం జగన్ మహిళా పక్షపాతి అన్నారు. ఎంపీపీ పైల రాజు, జెడ్‌పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేరుపురం వద్ద బోర్‌వెల్ పనులు ప్రారంభం..

చోడవరం : అంబేరుపురం వద్ద శారదా నదిలో సుమారు రూ. 3.40 కోట్లతో చేపట్టిన పంపింగ్ బోర్‌వెల్, ప్రధాన పైపులైన్ల విస్తరణ పనులకు బుధవారం విప్ ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు. అంబేరుపురం, గోవాడ, వెంకన్నపాలెం గ్రామాలను అనుసంధానం చేస్తూ అక్కడున్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని పంపింగ్ చేసేందుకు ఈ బోర్‌వెల్‌ను నిర్మిస్తున్నారు. బోర్‌వెల్‌కు రూ. 1.80 కోట్లు, పైప్ లైన్ విస్తరణకు రూ. 1.60 కోట్లు మంజూరయ్యాయి. చిన్నచిన్న బోర్ల వల్ల తరుచూ ఇబ్బందులు తలెత్తుతుండటంతో నదుల్లో పెద్ద బోర్‌వెల్స్‌ను నిర్మించి ట్యాంక్‌లకు పంపింగ్ చేస్తే శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారమవుతందని భారీ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, సర్పంచ్‌లు కార్లె ఈశ్వరమ్మ, మళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు శరగడం నాగేశ్వరరావు, కోటిభూలోక, జిల్లా యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి నాగ దుర్గ గోవింద, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శివకృష్ణ, ఏఈ కనకమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా చోడవరం పట్టణంలో పాత చెరువు ట్యాంక్ బండ్‌ను పార్కుగా అభివృద్ధి చేసేందుకు వీఎంఆర్‌డీఏ నుంచి రూ. 55 లక్షలు మంజూరయ్యాయని ధర్మశ్రీ చెప్పారు. త్వరలో పనులు చేపడతామన్నారు.



కొత్తకోటలో ఇంటింటి కుళాయి పథకాన్ని ప్రారంభిస్తున్న ధర్మశ్రీ



శారదానదిలో బోర్‌వెల్ పనులను పాంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

తేనెటీగల దాడిలో ఉపాధ్యాయుడికి తీవ్ర అస్వస్థత

యలమంచిలి రూరల్ : పొలం పని చేసుకుంటున్న ఉపాధ్యాయుడిపై వందల సంఖ్యలో తేనెటీగలు దాడి చేశాయి. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన అతను విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. యలమంచిలి మండలం ములకలాపల్లికి చెందిన వత్సవాయి జానకిరామరాజు తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు గుంపుగా వచ్చి దాడి చేశాయి. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు బంధువులు. రేగుపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ గత నెల 29వ తేదీన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ



మహిళలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న విప్ ధర్మశ్రీ

రావికమతం : రావికమతంలో 622 మంది మహిళలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను బుధవారం విప్ ధర్మశ్రీ అందజేశారు. సొంతిల్లు లేకుండా ఎవరూ ఉండకూడదని సీఎం జగన్ ఇంత చక్కని కార్యక్రమం చేపట్టారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, తహసీల్దార్ రమణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెదముషిడివాడ వీఆర్వో సస్పెన్షన్

తుమ్మపాల: విధినిర్వహణలో అలసత్వం వహించిన పెదముషిడివాడ వీఆర్వో కె.అప్పారావును సస్పెండ్ చేస్తూ అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వీఆర్వోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వెదురుపర్తి హైస్కూలులో 'పై' వారోత్సవాలు


గణితంలో 'పై' విలువ ప్రాధాన్యతను వివరిస్తున్న విద్యార్థులు

కశింకోట: వెదురుపర్తి హైస్కూలులో గణితంలోని 'పై' (22/7) వారోత్సవాలను బుధవారం హెచ్ఎం జి.వి.కె.ఆచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు వివిధరూపాల్లో 'పై' వి లువ గురించి రోజుకొక విధానంలో అవగాహన కలిగిస్తారన్నారు. గణితంలో 'పై'విలువ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు నృత్యం చేసి, పాటలు పాడారు. అనంతరం బహుమతులు అందజేశారు. గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్. మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నా రావు, నూకరాజు, విజయ్ పాల్గొన్నారు.

గాజువాక సమన్వయకర్తగా గుడివాడ నియామకంపై హర్షం


మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసిన గున్నయ్యనాయుడు, మలసాల కిషోర్

కశింకోట: వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్తగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియమితులు కావడం పట్ల మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులు విశాఖ విమానాశ్రయానికి వెళ్లి బుధవారం అమర్‌నాథ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 5,713 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,720	4,420
మొదటి రకం	3,560	4,340
రెండో రకం	3,400	3,760
మూడో రకం	3,180	3,450

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
ఆపరేషన్ వాలెంటైన్	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-12 యూనిట్లు, బి పాజిటివ్-38 యూనిట్లు, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 409 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

అగ్రహారం...అభివృద్ధి శరవేగం




గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీలు



గ్రామంలో నిర్మించిన సీసీరోడ్లు

• రూపురేఖలు మారిన సీహెచ్ఎన్ అగ్రహారం


జగనన్న కాలనీలో నిర్మించిన ఇల్లు

అనకాపల్లి: టీడీపీ ప్రభుతం హయాంలో కనీస స్థాయిలో కూడా అభివృద్ధికి నోచుకోని మండలంలోని చింతనిప్పుల అగ్రహారం(సీహెచ్ఎన్ అగ్రహారం) వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన ఐదేళ్లలో ప్రగతి పథంలో పరుగులుతీస్తోంది. గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గ్రామంలో రైతు, నిరుపేద కుటుంబాలు ఎక్కువగా జీవిస్తున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని వీరిని గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో చాలా మంది వలసబాట పట్టారు. దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలెన్నో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పరిష్కారమయ్యాయి. రెండు వేల మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో 1,423 మంది ఓటర్లు ఉండగా, 502 గృహాలు ఉన్నాయి. సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైనసేవలు అందిస్తున్నారు. ప్రభుత్వసేవలు, సంక్షేమపథకాలు సకాలంలో అందుతుండంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలకు గ్రామంలో ఈ ఐదేళ్లలో రూ.2,17,22,206 ఖర్చుచేసింది.

గ్రామంలో అమలైన సంక్షేమం అభివృద్ధి పథకాల వివరాలు

పథకం పేరు	లబ్ధిదారులు	నగదు రూ.లలో
జగనన్న అమ్మ ఒడి	165	72,73,167
జగనన్న విద్యాదీవెన	128	33,96,073
జగనన్న వసతి దీవెన	92	14,24,985
వైఎస్సార్ రైతుభరోసా	302	1,43,33,985
ఉచిత పంటలబీమ	4	862
సున్నావడ్డీ పంటరుణాలు	91	1,17,610
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	63	1,72,875
వైఎస్సార్ పింఛన్ కానుక	295	2,78,43,500
వైఎస్సార్‌చేయూత	120	51,56,250
వైఎస్సార్ ఆసరా	390	1,21,10,833
సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	461	8,16,157
వైఎస్సార్ కాపునేస్తం	51	22,65,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2	30,000
కల్యాణమస్తు, షాదీ తోఫా	1	50,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	96	16,39,573
ఆరోగ్య ఆసరా	49	3,53,300
హౌసింగ్ లబ్ధిదారులకు చెల్లింపు	19	17,88,920
వైఎస్సార్ బీమా	5	6,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	22	7,30,000
జగనన్న చేదోడు	17	4,20,000
కోవిడ్ సమయంలో సహాయం	500	5,00,000
జగనన్న తోడు (వడ్డీ)	36	19,899
పరోక్ష ప్రయోజనాలు		
భూసేకరణ అభివృద్ధికి చెల్లించిన నగదు	24	59,04,000
జగనన్న విద్యాకానుక	97	6,88,894
బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ	14	1,85,108
జగనన్న తోడు (రుణాలు)	75	13,96,425
జగనన్న గోరుముద్ద	101	10,00,607
వైఎస్సార్ సంపూర్ణపోషణ	111	20,79,030
వైఎస్సార్ కంటివెలుగు	519	1,13,37,036


జగనన్న కాలనీలో నిర్మించిన గృహం

నాడు అధోగతి నేడు అభివృద్ధి

టీడీపీ హయాంలో మా గ్రామాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కనీస స్థాయిలో కూడా అభివృద్ధి పనులు జరగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత గ్రామం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. రహదారులు, డ్రైనేజీలను నిర్మించారు. మురికికూపంలా ఉండే గ్రామం శుభ్రపడింది. గ్రామందాటే పని లేకుండా అన్ని సేవలు అందుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
– ఎస్. శ్రీనివాసరావు, సీహెచ్.ఎస్.అగ్రహారం

సకాలంలో ప్రభుత్వ సేవలు

ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతున్నాయి. సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటే అందజేస్తున్నారు. ఇంతపెద్దమొత్తంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వాన్ని నేనెప్పుడూ చూడలేదు. గ్రామం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పని చేసి సీఎం జగన్ రుణం తీర్చుకుంటాం.
– జి.కొండబాబు, సీహెచ్.ఎస్.అగ్రహారం

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం


తీడలో మేం సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


జి. భీమవరంలో నినదిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కశింకోట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు పార్టీ శ్రేణులకు సూచించారు. మండలంలోని తీడ, చెరకాం, సుందరయ్యపేట, అడ్డాం, జి. భీమవరం గ్రామాల్లో బుధవారం మేం సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జై జగన్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి, మలసాల భరత్ కుమార్ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి పార్టీ మరింత బలోపేతం కావడానికి కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు చిరికి సత్యనారాయణ, వెన్నెలనాయుడు,వెంకట్, శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

తుమ్మపాల: పట్టణంలో సాయి కుల్వంత్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.కామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైన, 25 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఐసీఐసీఐ బ్యాంకుతో పాటు వివిధ బ్యాంకుల్లో రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి: అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ హెచ్‌సీ రామకృష్ణ తెలిపారు. స్థానిక సుంకరమెట్ట కూడలిలో బుధవారం వాహనాలు తనిఖీ చేసినట్టు చెప్పారు. అనకాపల్లి నుంచి మునగపాక వైపు వెళుతున్న మునగపాక గ్రామానికి చెందిన యు.పూర్ణచంద్రరావు వాహనాన్ని తనిఖీ చేయగా మద్యం 15 మద్యం బాటిళ్లు బయటపడ్డాయని ఆయన తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు.

'ఆదర్శపాఠశాల' ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామం వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం బుధవారం తెలిపారు. తమ పాఠశాలలో ప్రవేశించగోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు.

ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీలైతే 2010 సె ప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెలఖరులోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీలైతే రూ.150, ఎస్సీ,ఎస్టీలైతే రూ.75 చెల్లించి ఫొటో, ఆధార్ నంబర్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని చెప్పారు. అనంతరం ఆ దరఖాస్తును ప్రింట్ తీయించి దానితోపాటు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీలను జత చేసి తమ పాఠశాలలో అందజేయాలన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు తమ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 8186069433, 9985388489 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు గవర్ల అనకాపల్లిలో మరిడిమాంబ పండగ


మరిడిమాంబ అమ్మవారు

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో గు రువారం మరిడి మాంబ అమ్మ వారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వర రావు తెలిపారు. ఏటా మార్చి రెండవ వారంలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్ సొమ్ము చెల్లించాలి

అనకాపల్లి: ప్రభుత్వ హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు తిరిగి చెల్లించాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వైఎస్.భద్రం, అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా బాధితులు పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మొల్లేటి గోపాలరమణ తదితరులు పాల్గొన్నారు.

17న పక్షుల కోసం మట్టి పాత్రల పంపిణీ

అనకాపల్లి: పక్షులకు తిండి గింజలు, తాగునీరు అందించేందుకు వీలుగా ఈనెల 17న గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ఆలయాల వద్ద మట్టి పాత్రలు పంపిణీ చేయనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పక్షులకు తాగునీరు, తిండి గింజలు అందించాలని ఆయన కోరారు.

కొణతాల సమావేశానికి దాడి మళ్లీ డుమ్మా

కశింకోట: కశింకోటలోని పీఏసీఎస్ సమీపంలో బుధవారం రాత్రి నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు డుమ్మా కొట్టారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణకు, దాడికి మధ్య రాజకీయ వైరుధ్యం తెలిసిందే. ఇటీవల ఇద్దరూ కలిసినప్పటికీ దాడి ఈ సమావేశానికి గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. ఈ సమావేశానికి దాడి వస్తారని నిర్వాహకులు ముందుగా ప్రకటించినప్పటికీ అలా జరగలేదు. వ్యక్తిగత పనులు ఉండటం వల్ల సమావేశానికి రాలేకపోయారని పార్టీ వర్గాలు సర్దిచెప్పాయి.

రెండు పశువుల పాకలు దగ్ధం


దగ్ధమైన పశువుల పాక

అనకాపల్లి: మండలంలోని కూండ్రంలో బుధవారం వేకువజామున జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన యలమంచిలి రమణ, యలమంచిలి దేముళ్లకు చెందిన పశువులపాకలు కాలిపోయాయి. రెండు గేదెలు స్వల్పంగా గాయపడ్డాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

హక్కుల కోసం మహిళలు పోరాడాలి

తుమ్మపాల: పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తున్నప్పటికీ నేటికీ వేతనాల్లో వ్యత్యాసం ఉందని, మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో బుధవారం ఐద్వా పతాకావిష్కరణ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కారణంగా మహిళలు రోజులో 12 గంటల పాటు పనిచేయవలసిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నేతలు నాగమణి, తోట పార్వతి, రాణి, అడివి అమ్మ పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శ్మశానవాటిక అభివృద్ధికి విశాఖ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తున్న వైవీ.సుబ్బారెడ్డి

అనకాపల్లి: స్థానిక శారదాబ్రిడ్జి వద్ద హిందూ శ్మశానవాటికలో రూ.1.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యులు వైవీ.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ, 82వవార్డు కార్పొరేటర్ మందపాటి సునీత విశాఖ నుంచి వర్చువల్ విధానంలో బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ జీవీఎంసీ అనకాపల్లి జోన్ 82వవార్డు ప్రధాన శ్మశానవాటికలో అంత్యక్రియల కోసం గ్యాస్ ఆధారిత బర్నింగ్‌మిషన్, భవననిర్మాణంతోపాటు ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి


కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు


మహిళకు రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న భరత్‌కుమార్, సునీత

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో 82వ వార్డు పరిధి నర్సింగరావుపేటలో బుధవారం అర్హులైన లబ్ధిదారులకు జగనన్న గృహ రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజవర్గంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గైపూరి రాజు, పలకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం జగనన్న ఆరోగ్యసురక్ష-2 శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పరిశీలించిన అనంతరం భరత్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా సకాలంలో మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. ఈ శిబిరంలో 354 మందికి డాక్టర్ నరేంద్ర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


నరసింగబిల్లిలో అనాథ బాలుడు ప్రసాద్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూలు 2007–08 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. అనాథ బాలుని దత్తత తీసుకొని చదివించడానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. జెట్టపురెడ్డితునికి చెందిన అల్లవరపు భారతి గతంలో మృతి చెందడంతో ఆమె కుమారుడు ప్రసాద్ అనాథ అయ్యాడు. దీంతో ప్రసాద్‌కు విద్యా బుద్ధులు నేర్పించి ప్రయోజకుడిని చేయాలని వారు నిర్ణయించుకున్నారు. నరసింగబిల్లి హైస్కూలులో చదివిన 2009–08 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా కలిసి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చి ప్రాథమికంగా చదివించడానికి అందజేశారు. బాలుని చదువు పూర్తి చేయడానికి భవిష్యత్తులో ఇలాగే తమకు తోచిన సహాయాన్ని సమకూర్చాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు.

తాళ్లపాలెం హైస్కూల్‌కు ఫ్యాన్లు, కుర్చీల వితరణ


తాళ్లపాలెం హైస్కలుకు అందజేసిన ఫ్యాన్లు, కుర్చీలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్‌కు పది ఫ్యాన్లు, పది కుర్చీలను బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు వితరణగా అందజేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సూచన మేరకు వీటిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, స్కూలు హెచ్ఎం విజయలక్ష్మి, స్కూలు కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, స్కూలు ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా విశాలాక్షి,కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం


విశాలాక్షి,కాశీ విశ్వేశ్వర స్వామిల కల్యాణంలో పాల్గొన్న దంపతులు


అన్న సమారాధనకు హాజరైన భక్తులు

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో బుధవారం విశాలాక్షి, కాశీ విశ్వేశ్వర స్వామిల కల్యాణం ఘనంగా జరిగింది. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. వేదపండితులు పరిటి సోమశేఖరశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.